క్లుప్తంగా

ఘనంగా సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ



సత్తెమ్మతల్లి అమ్మవారి ఊరేగింపులో భక్తులు

మునగపాక: మునగపాక దళితవాడలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. కాలనీ వాసులంతా డప్పు వాయిద్యాల నడుమ ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా గణపతి ఆలయ వార్షికోత్సవం



గణనాథుడిని దర్శించుకుంటున్న భక్తులు, నాయకులు

నక్కపల్లి: ఉద్దండపురంలో గణపతి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి గణపతి హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. ఉద్దండపురం, గుల్లిపాడు, తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ, పాడగట్ల పాపారావు, సర్పంచ్ పాడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ సభ్యుడు బచ్చలరాజు, కనకారావు, పి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టరూ..



గోతులతో అధ్వానంగా ఉన్న రామన్నపాలెం సెంటర్ రహదారి

కోటవురట్ల: రామన్నపాలెం జంక్షన్‌లో రహదారి శిథిలమైంది. పెద్ద పెద్ద గోతులు పడడంతో వర్షాలకు మరింత అధ్వానంగా తయారైంది. రాకపోకలకు వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అంతే కాకుండా డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లల్లోని వాడుకనీరు రోడ్లపై ప్రవహించి మురికి కూపంగా తయారవుతోంది. పారిశుద్ధ్యం మెరుగుకు కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శిథిల భవనాలతో ముప్పు



శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్న భవనం

కోటవురట్ల: ఏళ్ల తరబడి శిథిల భవనాలను తొలగించకపోవడంతో ప్రమాదం పొంచి చూస్తోంది. అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిథిల భవనాలు ఆందోళనకరంగా ఉన్నాయి. కొంచెం కొంచెంగా కూలిపోతున్నాయి. విద్యార్థులు ఏమరుపాటుగా భవనాల వద్దకు వెళితే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. చాలా కాలంగా శిథిల భవనాలు ఉన్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రమాదం జరగక ముందే శిథిల భవనాలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఈ ఏడాదైనా బా(సా)గయ్యేనా?

- మరమ్మతులకు నోచుకోని భూమి కాలువ
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు

ఒకప్పుడు పుష్కలంగా ప్రవహించే భూమి కాలువ నేడు మట్టి దిబ్బలు, పిచ్చిమొక్కలు, ఆక్రమణల కారణంగా వ్యవసాయ భూములకు సాగునీరు అందించలేకపోతోంది. నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో సుమారు 10 వేల ఎకరాలకు సాగు నీరందించే భూమి కాలువ ఎంతో కాలంగా మరమ్మతులకు కూడా నోచుకోలేదు. దీంతో తమ పొలాలకు సాగునీరు అందక ఎంతో మంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాదైనా అధికారులు స్పందించి కాలువలో పూడికతీత చేపట్టడంతో పాటు, గట్లు సరిచేసి నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నక్కపల్లి : నక్కపల్లి,పాయకరావుపేట మండలాల్లో సుమారు 10 వేల ఎకరాలకు సాగు నీరందించే భూమి కాలువ ఏళ్ల తరబడి పూర్తిస్థాయి మరమ్మతులకు నోచుకోలేదు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌కు ఈ కాలువలకు మరమ్మతు చేస్తారని ఆశ పడుతున్న రైతాంగానికి నిరాశే ఎదురవుతోంది. మరో రెండు నెలల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. రైతులకు సాగునీరు అందేందుకు నీటి పారుదల శాఖ చర్యలు చేపట్టకపోతే సాగు కష్టమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడచిన 40 ఏళ్లలో ఏనాడూ ఈ కాలువ ద్వారా తాండవ రిజర్వాయర్ నీరు విడుదలైన దాఖలాలు లేవు. 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి దృష్టికి అప్పటి జిల్లా మంత్రి కొణతాల రామకృష్ణ భూమి కాలువ ఆయకట్టు రైతుల పరిస్థితి తీసుకెళ్లి నీరు విడుదలయ్యేందుకు కృషి చేశారు. నియోజకవర్గ వాటా కింద రావాల్సిన 35 క్యూసెక్కుల నీరు విడుదలకు జీవో విడుదల చేయించారు. అప్పటి నుంచి భూమి కాలువ ద్వారా నీరు ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో విడుదలవుతోంది. అయితే కాలువను మరమ్మతు చేయించడంలో నిర్లక్ష్యం వహించడంతో చివరి ఆయకట్టుకు నీరు చేరడం లేదు. ఎపూడిక తీత, పిచ్చిమొక్కల తొలగింపు వంటి పనులు చేపట్టకపోవడంతో ఈ కాలువ ద్వారా తాండవ జలాలు విడుదలైనప్పటికీ, రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. తాండవ నది నుంచి పాయకరావుపేట మండలంలో గల పాయకరావుపేట, పి.ఎల్.పురం, సీతారాంపురం, నామవరం, నక్కపల్లి మండలంలోని దేవవరం, ఒడ్డిమెట్ల, చినరామభద్రపురం, గొడిచెర్ల, కొత్తూరు, ఉద్దండపురం గ్రామాల పరిధిలో ఉన్న వ్యవసాయ భూములకు సాగునీరు అందించేందుకు భూమి కాలువ ఉంది. ఈ కాలువ కింద సుమారు 10 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. గతంలో రైతులు



పూడికతీతకు నోచుకోక పిచ్చిమొక్కలతో నిండిన భూమి కాలువ



షట్టర్లు లేని మదుం

భూమి కాలువ ద్వారా ఖరీఫ్‌లో నీటి కోసం రేయింబవళ్లు కాలువ గట్లపై పడిగాపులు పడాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. నిరంతరం ఈ కాలువ ద్వారా ఖరీఫ్, రబీలో నీరు విడుదలవుతోంది. చెరువు కింద ఆయకట్టు రైతులు కూడా వర్షాలు పడకపోతే చెరువులో నీరు చేరకపోవడం వల్ల తాండవ నీటిపైనే ఆధారపడి సాగు చేస్తుంటారు.

ఎంపీ నిధులతో తాత్కాలిక మరమ్మతులు..

రెండేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి రూ.10 లక్షలు మంజూరు చేయడంతో పాటు, మండల పరిషత్ నుంచి మరో రూ. 10 లక్షలు కేటాయించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీంతో తాండవ షుగర్ ఫ్యాక్టరీ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు కాలువకు కొంత మేర మరమ్మతు చేశారు. అలాగే పూడిక తీత పనులు కూడా చేయడంతో గత ఏడాది ఖరీఫ్‌కు ఢోకా లేకుండా తాండవ నీరు సరఫరా అయింది.

మట్టి దిబ్బలు, పిచ్చిమొక్కలతో మళ్లీ అదే పరిస్థితి..

కానీ మళ్లీ కాలువ పరిస్థితి మొదటికొచ్చింది. సుమారు 10 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ కాలువ మొత్తం మట్టి దిబ్బలు, పిచ్చిమొక్కలతో నిండి ఉంది. చాలా చోట్ల ఆక్రమణలకు గురయింది. పి.ఎల్.పురం, నామవరం, ఒడ్డిమెట్ల, గొడిచెర్ల వద్ద ఈ ఛానల్‌లో నిర్మించిన స్లూయిస్ (మదుం)లకు షట్టర్లు లేవు. మదుంలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. పూర్తిస్థాయిలో ఒక పర్యాయం కాలువకు మరమ్మతు చేపడితే మరో ఐదేళ్ల వరకు తిరిగి చూసుకోనక్కర్లేదు. కాలువలో మట్టి మేటలు వేయడం, పిచ్చిమొక్కలు పెరగడం వల్ల నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, కాలువను ఆనుకుని ఉన్న భూముల రైతులు చెబుతున్నారు. కాలువకు దూరంగా ఉన్న భూములకు పిల్ల కాలువల ద్వారా నీటిని తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని వారు చెబుతున్నారు. కొన్ని చోట్ల అయితే ఇంజిన్ల సహాయంతో కాలువలో నీరు తోడుకోవాల్సిన పరిస్థితి వస్తోందని వారు చెబుతున్నారు. కాలువ నీరు చివరినున్న ఆయకట్టు భూముల వరకు చేరకపోవడంతో కొంతమంది గత ఏడాది సాగు చేయడం మానేసారు. మధ్యలో నీటి కొరత ఏర్పడితే పెట్టుబడి నష్టపోవాల్సి వస్తుందన్న బెంగతో సాగు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాదైనా అధికారులు స్పందించి కాలువలో పూడికతీత పనులు చేపట్టడంతో పాటు, గట్లు సరిచేసి నీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధి కూలీ రూ.600 చెల్లించాలి



వెంకటాపురంలో కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక: ఉపాధి హామీ పథకం కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు రోజుకు రూ.600 చొప్పున వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. మండలంలోని వెంకటాపురంలో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను ఆయన ఆదివారం అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీలు తమ సమస్యలను వెల్లడించారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడవాలని చూస్తోందని ఆరోపించారు. ఎంతో మంది పోరాటాల ఫలితంగా ఈ పథకం అమల్లోకి వచ్చిందన్నారు. పని చేసే ప్రాంతాల్లో కూలీలందరికీ సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

రాంబిల్లి ఇన్‌చార్జి సీఐగా దీనబంధు

రాంబిల్లి : శాంతి భద్రతల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రాంబిల్లి ఇన్‌చార్జి సీఐ దీనబంధు పేర్కొన్నారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక్కడ సీఐగా పని చేసిన లక్ష్మణరావు బదిలీపై వెళ్లారు. అనకాపల్లి దిశ పోలీస్ స్టేషన్ సీఐగా పని చేస్తున్న దీనబంధుకు రాంబిల్లి సీఐగా బాధ్యతలు అప్పగించారు. గతంలో దీనబంధు రాంబిల్లి ఎస్‌ఐగా పని చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

మునగపాక: విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మునగపాకలోని సంతబయల గౌతమ పఠన మందిరం ఆధ్వర్యంలో వేసవిలో విద్యార్థులకు డ్రాయింగ్‌పై శిక్షణ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు స్థానికంగా అందుబాటులో ఉండే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి గౌతమ పఠన మందిర సభ్యులు అందిస్తున్న సేవలను కొనియాడారు. మందిర అధ్యక్ష, కార్యదర్శులు మారిశెట్టి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

అప్పారావు, వెలగా శ్రీనివాసరావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పీజీ కోర్సులు ప్రవేశ పెట్టాలని వినతి

నర్సీపట్నం: గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ కళాశాలలో ప్రాధాన్యత కలిగిన పీజీ కోర్సులు ప్రవేశ పెట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఐదు వేల మంది చదువుతున్నారు. పీజీ చదివేందుకు వీరంతా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంఏ కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తే ఈ ప్రాంత విద్యార్థులకు మేలు చేకూరుతుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రెసిడెంట్ జి.గీతాకృష్ణ ప్రిన్సిపాల్‌కు వివరించారు.

త్వరితగతిన ఆలయ నిర్మాణం

మునగపాక : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చూడాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీనివాసుని ఆలయ ప్రాంగణంలో ఆదివారం గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులపై కమిటీ సభ్యులు, పెద్దలు దృష్టి సారించాలన్నారు. అలాగే విరాళాల సేకరణ చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరినీ ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనా



గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

రాయణ, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, జల్లేపల్లి వెంకట కృష్ణారావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి కాశీబాబు, ఆడారి దానకర్ణ, వెలగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితులకు న్యాయం చేయాలి

రాంబిల్లి : నేవీ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని పెదకలవలాపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్లు డిమాండ్ చేశారు. ఆదివారం పెదకలవలాపల్లి గ్రామంలో నేవీ నిర్వాసితులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా రోజులుగా నేవీ ప్రహరీ నిర్మాణంతో తమకు అన్యాయం జరుగుతుందన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా నేవీ ప్రహరీ నిర్మాణంతో నష్టపోతున్న వారికి తగిన పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సుమారు 300 మంది మహిళలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నేవీ నిర్వాసితులు

వైఎస్సార్‌సీపీ నాయకులు ధైర్యంగా ఉండాలి

ఎస్.రాయవరం : వైఎస్సార్‌సీపీ నాయకులు ధైర్యంగా ఉండాలని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. వెంకటాపురంలో ఇటీవరం మెడ నొప్పికి శస్త్ర చికిత్స చేయించుకున్న మరిశా రమణమూర్తిని ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరగా కోలుకుని ప్రశాంతంగా ఉండాలన్నారు. ఈ పరామర్శలో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కొప్పిశెట్టి సత్యం, దూళి శ్రీనుబాబు, శానాపతి శ్రీరాములు, నాయకులు శ్రీపతిరాజు, నల్లపరాజు వెంటరాజు, పోచిన నరేష్, చోడిపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.



రమణమూర్తిని పరామర్శిస్తున్న కంబాల జోగులు

నీటిబొట్టు.. ఒడిసి పట్టు

- పెనుగొల్లు-పెద ఉప్పలం గ్రోయిన్‌కు రైతుల శ్రమదానం
- గ్రోయిన్లకు మరమ్మతులు లేక వృథాగా పోతున్న నీరు
- అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నదాతల విన్నపం



పెనుగొల్లు-పెద ఉప్పలం గ్రోయిన్‌కు శ్రమదానంతో మరమ్మతు చేస్తున్న రైతులు

ఎస్.రాయవరం: వరహా నదిలో గ్రోయిన్ల మరమ్మతులు పూర్తి చేయకపోవడంతో రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు నదిలో నీటి ప్రవాహం ప్రారంభం కావడంతో దెబ్బతిన్న గ్రోయిన్ల నుంచి నీరు వృథాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుగొల్లు సమీపంలో ఉన్న గ్రోయిన్‌కు ఉప్పరాపల్లి, వెంకటాపురం గ్రామానికి చెందిన రైతులు శ్రమదానంతో ఇసుక బస్తాలు వేసి నీటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ గ్రోయిన్‌కు సుమారు 8 ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు ముందుకు రావాల్సి వస్తుందని చెబుతున్నారు. అధికారులు గడిచిన రెండేళ్లుగా గ్రోయిన్‌కు తాత్కాలిక గట్టు వేయించినా ఫలితం లేకుండాపోతుందని రైతులు చెబుతున్నారు. నాలుగేళ్ల క్రితం గ్రోయిన్ మరమ్మతులకు రూ. 35 లక్షలు విడుదల అయినప్పటికీ మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ సమస్య మరింత ఎక్కువయిందని చెబుతున్నారు. దీంతో రైతులకు శ్రమదానం తప్పడంలేదంటున్నారు. ఇదే క్రమంలో జమ్మికాలువ, మూలపొలం గ్రోయిన్లు ఉన్నాయి. వమ్మవరం వద్ద కొరుప్రోలు, పెదఉప్పలం కట్టకు చెందిన గేట్లు కూడా మరమ్మతులకు గురి కావడంతో సీజన్‌లో సాగునీరు పారే పరిస్థితి లేదని చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రోయిన్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ఈ సీజన్‌కు నీరు వచ్చే సదుపాయం కల్పించాలని రైతులు కోరుతున్నారు. ఆ తర్వాత శాశ్వత పరిష్కారం చూపాలంటున్నారు.



గ్రోయిన్ దెబ్బ తినడంతో వృథాగా దిగువకు పోతున్న సాగునీరు



తొలకరి ప్రారంభంలోనే నదిలో చేరిన నీరు

మునగపాకలో సంబరాలు

మునగపాక : ప్రధానిగా నరేంద్ర మోదీ మూడవ పర్యాయం ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఆదివారం రాత్రి మునగపాకలో సంబరాలు జరుపుకున్నారు. పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో బీజేపీ జిల్లా నాయకులు దొడ్డి వెంకట సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, రామునాయుడు, బుజ్జి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న నేతలు

వేడుకగా అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం



ఎస్.రాయవరం: మండలంలో సైతారుపేట గ్రామంలో అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గత వారం నిర్వహించాల్సిన ఈ వేడుక ఎన్నిక కోడ్ కారణంగా ఉత్సవ కమిటీ వాయిదా వేసింది. స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన గుర్రపు పందేలు ఆకట్టుకున్నాయి. ఈ పందేల్లో 16 గుర్రాలు తలపడ్డాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం

కె.కోటపాడు: అంగన్‌వాడీలో ఐదేళ్లు పూర్తయిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. గొల్లలపాలెం, దాలివలస గ్రామాల్లో ఆదివారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వరలక్ష్మి, శ్రీనివాస్ చిన్నారుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ఉచితంగా విద్యా కానుక కిట్లు ఇస్తున్నామని, చిన్నారులను చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతన్నామని ఉపాధ్యాయిని వరలక్ష్మి తెలిపారు. చదువుతోపాటు ఆటల్లోను ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి కార్యక్రమం విద్యార్థులకు అందనున్నట్లు దాలివలస హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు.



గొల్లలపాలెంలో విద్యార్థుల వివరాలు నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయిని వరలక్ష్మి

జోరుగా విద్యుత్ లైన్ పనులు

రోలుగుంట: మండలంలో బుచ్చింపేట నుంచి గుర్రంపేట మీదుగా వైద్యుత్ లైను ఏర్పాటు పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ గ్రామాల రోడ్డులో విద్యుత్ లైను లేక రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఆయా గ్రామాల సర్పంచులు ఉలబాల చంద్ర, గుములూరి బాబులు, ఎంపీటీసీలు ఉలబాల సత్యవతి, యర్రంశెట్టి కాంతమ్మ విద్యుత్ శాఖ ఉన్నతాధికారుకు నివేదించారు. ఈ మేరకు విద్యుత్ లైను ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో రహదారికి ఇరుపక్కలా అడ్డంకిగా ఉన్న చెట్ల ను, కొమ్మలను ఆ శాఖ అధికారులు నరికించి పాతిన స్తంభాలకు విద్యుత్ తీగలు వేస్తున్నారు. ఈ పనులు పర్యవేక్షించిన ఏఈ పద్మనాభం సిబ్బందికి పలు సూచనలు చేశారు.



గుర్రంపేట రోడ్డులో నూతనంగా వేసిన విద్యుత్ స్తంభాలు

అట్టహాసంగా కల్యాణ వేంకటేశ్వర స్వామి పెళ్లిరాట

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి 14వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారి పెళ్లి రాట వేశారు. స్వామివారి సన్నిధిలో వేదమంత్రోచ్చరణల మధ్య ఈ వేడుక జరిగింది. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు, కమిటీ ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, కోశాధికారి పుట్టా బలరామూర్తి, కమిటీ సభ్యులు యల్లపు రాము, భక్తులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో వృద్ధులకు భోజన వితరణ

రోలుగుంట: వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో కొవ్వూరులో నడుస్తున్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు రావికమతం మండలానికి చెందిన హెల్పింగ్ యూత్ సభ్యులు ఆదివారం భోజన ప్యాకెట్లను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటుపైనా ఎవరైనా భిక్షాటన చేసేవారికిగానీ, తిండి దొరకని వారికి గాని ఆర్థిక సాయం చేయొద్దని, కడుపు నిండా తిండి పెట్టాలన్నారు. ఆర్థిక సాయం కన్నా అన్నదానం మిన్న అనే భావంతో ఆశ్రమంలో 35 మంది వృద్ధులకు, కొత్తకోట, రోలుగుంట గ్రామాల్లో 300 మంది యాచకులకు భోజన ప్యాకెట్లు అందజేశామన్నారు. ఈ సందర్భంగా హెల్పింగ్ యూత్ సభ్యులను యర్రంశెట్టి రాజారావు అభినందించారు.

చెత్త తరలింపు ట్రాక్టరు ప్రారంభం

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో గ్రామ పంచాయతీకి సంబంధించిన చెత్త తరలింపు ట్రాక్టరును సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో గత ప్రభుత్వ హయాంలో ఈ ట్రాక్టరు మంజూరైంది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల గతంలో ప్రారంభించలేదు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచడానికిగాను ట్రాక్టరును పంచాయతీకి సమకూర్చామన్నారు.